క్లుప్తంగా

యోగాతోనే ఆరోగ్యం



ఏఎన్‌యూ: ఆధునిక జీవనశైలి సమస్యలన్నింటికి ఒకేఒక పరిష్కారం 'యోగ- ధ్యానం' అని టీడీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్గత ఐక్యత–బాహ్య సమతుల్యతలకు 'యోగ - ధ్యానమే' సాధనాలని తెలిపారు. రెండు రోజులుగా యోగ విభాగంలో జరిగిన జాతీయ కార్యశాల గురువారం ముగిసింది. యోగా ద్వారానే ఆరోగ్యం ఆనందం సాధ్యమని, ఆత్మానుసంధానమే యోగా అంతిమ లక్ష్యం అని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రచార్యులు పి.జాన్సన్, సత్యమూర్తి, జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన సుధాదేవి, సిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ ప్రియాంక, సమన్వయకర్త డి.సూర్య నారాయణ, రాధిక పాల్గొన్నారు.

రూ.8.44 లక్షల అపరాధ రుసుం విధింపు

కొరిటిపాడు: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగ పర్యవేక్షక ఇంజినీర్ బి.విజయకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ డి.వెంకన్నచౌదరి, ఆపరేషన్ విభాగం గుంటూరు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గురువారం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గోరంట్ల, జొన్నలగడ్డ, రెడ్డిపాలెంల్లో 55 మంది అధికారులు, 160 మంది సిబ్బంది, 55 బృందాలుగా ఏర్పడి 4029 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 241 సర్వీసుల కింద రూ.8.14 లక్షలు, ఒక కేటగిరి తీసుకొని వేరొక కేటగిరికి వాడుకుంటున్న ఒకరికి రూ.10 వేలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన నాలుగు సర్వీసులకు రూ.20 వేలు మొత్తం కలిపి రూ.8.44 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు తెలిపారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు కె.గంగాధర్ రావు, జె.నాంచారయ్య, సి.హెచ్.వెంకటేశ్వర్లు, రామ చంద్ర రావు ఉన్నారు.

కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి

గుంటూరు లీగల్: పల్నాడు జిల్లా మాచర్ల వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం గుంటూరు జిల్లా రెండవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరయ్యారు. 2024లో టీడీపీ నాయకుడు అన్నపురెడ్డి అంజిరెడ్డి ఎన్నికల సమయంలో మాచర్ల పోలీసు స్టేషన్‌లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మరో ఆరుగురిపై కేసు పెట్టారు. ఈకేసు విషయమై గురువారం కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణ ఏప్రిల్ 4కు న్యాయమూర్తి వాయిదా వేశారు.

పరిశోధనలతోనే ఉజ్వల భవిష్యత్



గుంటూరు ఎడ్యుకేషన్: సైన్స్ రంగంలో పరిశోధనలపైనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉందని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) గౌరవ ఆచార్యులు దేశిరాజు నరసింహారావు పేర్కొన్నారు. గురువారం మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ది ఫేసినేటింగ్ వరల్డ్ ఆఫ్ ఎంజైమ్స్ అనే అంశంపై అతిథి ఉపన్యాసమిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ జె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

గుంటూరు రూరల్: తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పూర్ణకుమార్(20) పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడని తల్లి బుధవారం మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన పూర్ణకుమార్, తల్లిని పనికి వెళ్లనిచ్చి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లి ఇంట్లో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన విషయం చూసి పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పార్కింగ్ చిక్కుముడి

- నగరంలో అడ్డగోలుగా పార్కింగ్‌లు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పార్కింగ్‌లు



ఆర్కేటీ సెంటర్‌లో ఒక హోటల్, షాపింగ్ మాల్ ఎదురుగా వాహనాల పార్కింగ్

పట్నంబజారు: నగర ప్రజలను పార్కింగ్ చిక్కుముడి వెంటాడుతోంది. ఏ రోడ్డుకు వెళ్లిన పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. వాహనాలు పెడతామంటే... షాపింగ్ మాల్స్ యజమానులు టోకెన్లు కొడతారు... బయట పెడితే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తారు. ఇదీ నగర ప్రజలు పడుతున్న ఇబ్బందులు.

పెరుగుతున్న వాహనాలు...

గుంటూరు నగరంలో ట్రాఫిక్ పెరుగుతోంది. సుమారుగా రెండు లక్షల బైకులు, 40 వేలకుపైగా కార్లు, 25 వేలకుపైగా ఆటోలు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిత్యం ట్రాఫిక్ ఇబ్బందికి పార్కింగ్ సమస్య ఇంకొన్ని తంటాలు తెచ్చి పెడుతుతోంది. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో ఆక్రమణలు పెరిగిపోవటంతో పాటు భారీ షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు ఇతరత్రా వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు మరింత సమస్య ఏర్పడుతోంది.

సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయాలు..

రాజాగారితోటలో ద్విచక్ర వాహనాలకు సంబంధించి సెకండ్ హ్యాండ్ బైక్స్ విక్రయించే దుకాణాలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఐదారు లైన్లు బైక్స్‌తో పూర్తిగా ఆక్రమించుకుంటున్నాయి. గౌరీశంకర్ థియేటర్ రోడ్డులో వాహనాలకు సంబంధించి స్పేర్‌పార్ట్స్ విక్రయించే షాపుల ముందు బైక్‌లు,



గుజ్జనగుండ్ల డీమార్ట్ ఎదురుగా కార్లకు వీల్ లాక్ వేస్తున్న సీఐ సింగయ్య

అక్కడే ఉన్న ఆస్పత్రికి చెందిన వాహనాలకు కూడా పార్కింగ్ చేయటంతో రోడ్డంతా మూసుకుపోతోంది. మార్కెట్ ప్రాంతంలో దుకాణదారుల వాహనాలను హిమని కూల్‌డ్రింక్ సెంటర్ నుంచి సుమారుగా పలూకొట్లు సెంటర్ వరకు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బ్రాడీపేట నాలుగో లైనులో కూడా ఇదే పరిస్థితి. కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డు, 60 అడుగుల రోడ్డులో ఆస్పత్రులు యాజమాన్యాలు పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవటంతో రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు.

షాపింగ్ మాల్స్‌తో సమావేశం ఎప్పుడో..!

షాపింగ్ మాల్స్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి, మాల్స్ లోపల పార్కింగ్ ఏర్పాటుకు దృష్టి సారిస్తామని చెప్పిన ట్రాఫిక్ అధికారులు చోద్యం చూస్తున్నారు. నిత్యం రికవరీ వెహికల్స్‌లో వాహనాలను తీసుకెళ్లి, కొన్నింటికి జరిమానాలు విధించి, కొన్ని వాహనాలను రికవరీ వెహికల్స్ సిబ్బంది వారి జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. పలు వాహనాలనైతే.. ఏకంగా జరిమానాలు భారీగా పడుతుందని చెప్పి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని వాహనదారులు చెబుతున్నారు. షాపింగ్ మాల్స్ యజమానులతో మాట్లాడకుండా, రోడ్డుపై ఉన్న వాహనాలకు వీల్ లాకింగ్ సిస్టమ్ చేయటం ఎంత వరకు సబబనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇష్టానుసారంగా పార్కింగ్...

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రెండు ప్రధాన హోటల్స్ వద్ద రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. నాజ్ సెంటర్‌లోని షాపింగ్ మాల్ దగ్గర వింత పరిస్థితి. నిత్యావసరాలు కోసం షాపింగ్ మాల్‌కు వెళ్లిన క్రమంలో మాల్ లోపల పార్కింగ్ చేస్తే రూ.30 టోకెన్ చెల్లించాల్సి వస్తోంది. బయట పార్కింగ్ చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిచటంతో పాటు ట్రాఫిక్ పోలీసులు రికవరీ వ్యాన్‌లో వాహనాలను తీసుకెళ్లి జరిమానాలు విధిస్తున్నారు. ఈస్ట్ పరిధిలోని అత్యంత ఘోరమైన ప్రాంతాలు మాయాబజారు, రాజాగారితోట, మార్కెట్ ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో మాయాబజారు నిత్యం వేలాది మంది వాహనదారులు, అనేక మంది వ్యాపారులు అనేక ఇండస్ట్రీ వ్యాపారాలు నిమిత్తం వస్తుంటారు. పాత వాహనాల సామాన్లు, అనేక వ్యాపారాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో అడుగు తీసి అడుగు వేయాలంటే కదలలేని పరిస్థితి. ఏకంగా రోడ్డునంతా ఆక్రమించి సామన్లుతో నింపేశారు.

చర్యలు తీసుకుంటాం



నగరంలో షాపింగ్ మాల్స్ యాజమాన్యాలతో చర్యలు మాట్లాడి చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు పార్కింగ్ కల్పించాల్సిన బాధ్యత షాపింగ్ మాల్స్ యజమానులదే. రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటాం. అదే క్రమంలో మాల్స్, వ్యాపార, వాణిజ్య సముదాయల యజమానులు, నిర్వాహకులతో మాట్లాడి పార్కింగ్ కల్పించేలా దృష్టీ సారిస్తాం.

–ఎం.రమేష్, ట్రాఫిక్, డీఎస్పీ

అభివృద్ధి పనులు ప్రాధాన్య క్రమంలో చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగర పరిధిలో అభివృద్ధి పనులను స్థానిక ప్రజల అవసరాల రీత్యా ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదర్శ నగర్, ఏటీ అగ్రహారం, పెద్దపలకలూరు, స్వర్ణాంధ్ర నగర్, తారకరామ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ చేపట్టిన పనుల్లో జాప్యం జరిగితే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని, పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇప్పటికే నగరంలో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. బిల్లుల చెల్లింపు చేయడానికి ముందుగా ప్రతి పనిని పూర్తి స్థాయి పరిశీలన చేస్తామని, అందులో నాణ్యత లోపాన్ని గుర్తిస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, ఆర్ఓ రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్ లు ఆనంద కుమార్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏడుగురు అడ్మిన్ సెక్రటరీలు సస్పెన్షన్

నెహ్రూ నగర్: నగరంలో ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని, వారం రోజుల్లో జీరో వసూలు చేసిన ఏడుగురు అడ్మిన్ కార్యదర్శులను విధుల నుంచి సస్పెండ్ చేయాలని, పర్యవేక్షణ లోపంపై నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులతో ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఎం. నాగరాజు(14), డి.జయలక్ష్మి(7), ఎస్.కె.బి.అరుణ్ కుమార్(154), జె.పవన్ కుమార్(191), కె.కామేశ్వర రావు(163), షేక్ షబీన (40), జి. రేవంత్ నాగసాయి(60) అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఖజావలి, కాశయ్య, సుబ్బారావు, నాగరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. దీర్ఘకాలం బకాయిలు ఉండి చెల్లించని కమర్షియల్ సంస్థలను చట్ట ప్రకారం పంచనామా జరిపి సీజ్ చేయాలని చెప్పారు. డెప్యూటీ కమిషనర్లు ప్రతి రోజు పన్ను వసూలు పురోగతిపై సమీక్షించి ఏదో ఒక ప్రాంతంలో వసూళ్లలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటి కమిషనర్లు సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఆర్.ఓ.లు రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా, రెహమాన్, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న వి.రమేష్‌బాబు, జేఏసీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు మెడికల్: ఆప్కాస్ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధం కావాలని పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు, జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరావు పేర్కొన్నారు. గురువారం జీజీహెచ్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగిస్తే 1.20 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతారన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఉండడం వలన ప్రతినెలా 1న జీతాలు, సకాలంలో పీఎఫ్‌లు తీసుకుంటున్నారని చెప్పారు. ఆప్కాస్‌ను రద్దుచేస్తే సహించేది లేదన్నారు. ఆప్కాస్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే ఎన్నికల కోడ్ తర్వాత ప్రభుత్వంపై ఉద్యమ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ నందిగామ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.పాచ్చా, జాయింట్ సెక్రెటరీ స్నేహ, జానీ బాషా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నాగు నాయక్, బసవ సాంబయ్య, జేఏసీ జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు, జేఏసీ జనరల్ సెక్రెటరీ ముత్యాల రావు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉపసంహరించుకోవాలి

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన ఉపసంహరించుకోవాలని ఐక్య వేదిక జిల్లా చైర్మన్ చాంద్‌బాషా అన్నారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో చాంద్‌బాషా మీడియాతో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆప్కాస్ విధానాన్ని ప్రభుత్వం చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర శాఖ ఉపాధ్యక్షుడు నాగూర్‌వలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో గోపీచంద్, నాగసుశీల, ఎస్సార్కే ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జేకేసీ కళాశాలలో గురువారం ''మీకు స్ఫూర్తినిచ్చిన మహిళ – జాతీయ మహిళా నాయకురాలు'' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా కళాశాల మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు పి.నాగసుశీల మాట్లాడుతూ జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యత భారత గాన కోకిల బిరుదాంకితురాలు సరోజినీ నాయుడు జీవితాన్ని, ఆమె రచనలను, రాజకీయాల్లో ఆమె వహించిన పాత్రను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ సరోజినీ నాయుడు కవితలను, స్ఫూర్తిదాయకమైన ఆమె మనోధైర్యాన్ని, ధీరత్వాన్ని వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో బీబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి డి. కళ్యాణ్‌కుమార్, బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థిని వి.సౌజన్య, బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థి కె.కిరణ్‌కుమార్ వరసగా తొలి మూడు స్థానాల్లో నిలువగా, బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి ఎస్. జయకుమార్ ప్రత్యేక బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, న్యాయనిర్ణేతలుగా కె. వీణ, కె.అంజని, కె.అనితకుమారి వ్యవహరించారు.

ఓటు హక్కు వినియోగం పౌరుల బాధ్యత



ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న చల్లా ఓబులేసు

గుంటూరు ఎడ్యుకేషన్: ఓటరుగా నమోదు కావడంతో పాటు ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులు తమ బాధ్యతగా గుర్తించాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ చల్లా ఒబులేసు పేర్కొన్నారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఓటర్ నమోదు, ఓటు హక్కు వినియోగం (స్వీప్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. గుంటూరు జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ 'ఓటర్‌గా గర్విస్తున్నాను – ఓటు వేయుటకు సిద్ధంగా ఉన్నాను' అనే అంశం పై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీడియో ప్రదర్శించారు. విద్యార్థులచే తాము ఓటు నమోదు చేసుకుని ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, ఉపాధికల్పన కార్యాలయ అధికారి రమాదేవి, నగరపాలక సంస్థ ఉద్యోగులు జె. సూరజ్‌కుమార్, డాక్టర్ పి.సీ తారామయ్య, డాక్టర్ ఎ. రాజేష్, జె.శివజ్యోతి, సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పీహెచ్ హుస్సేన్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. నందివెలుగు రోడ్, గాంధీనగర్, ఆర్‌టీసీ కాలనీ, ధనమ్మ హోటల్ సెంటర్, నవభారత్ నగర్, రాఘవనగర్, వెంకట్రావుపేట ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ



శిక్షకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ గోపీచంద్, సురేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో ఇన్ఫోసిస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం ద్వారా డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గోపీచంద్ మాట్లాడుతూ ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన విధంగా ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌తో పాటు లైఫ్ స్కిల్స్, బిహేవియర్ స్కిల్స్‌ను సంస్థకు చెందిన శిక్షకులతో అందించారని వివరించారు. ఈసందర్భంగా నెల రోజుల పాటు శిక్షణ పొందిన 70 మంది విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, కంప్యూటర్ విభాగాధిపతి వై.వెంకటేశ్వరరావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వై.సురేష్ బాబు, శిక్షకుల మౌనిక, గోవిందు పాల్గొన్నారు.

మహిళలకు సరోజినీ నాయుడు ఆదర్శం



ప్రిన్సిపాల్ సుశీలతో పాటు ఉపాధ్యాయినులకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశానికి విశిష్ట సేవలు అందించిన సరోజినీ నాయుడు మహిళలకు ఆదర్శనీయురాలని జీకేఆర్ హైస్కూల్ డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టాభిపురం, ఏటీ అగ్రహారంలోని విద్యాసంస్థల్లో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయినులను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేశారు. మన మొదటి మహిళా గవర్నర్ అయిన సరోజినీ నాయుడు జన్మదినం సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులందరినీ సత్కరించుకోవడం మంచి పరిణామమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, సుశీల పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు

లక్ష్మీపురం: ఈనెల 27న నిర్వహించనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు జేఏసీ ఆఫ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ - వర్కర్స్ రాష్ట్ర చైర్మన్ ఎ.వి. నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన చేసిన ప్రతి పోరాటంలో మా వెన్నంటే ఉన్నది పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా చైర్మన్ బి.లక్ష్మణరావు, జిల్లా సెక్రెటరీ జనరల్ బి.ముత్యాలరావు, పలు విభాగాల నాయకులు జి.నాగరాజు, పి.రమేష్ బాబు, పి.శ్రీనివాసరావు, విజయ్, వై.శివశంకర్, షేక్ బాబు, హసన్ కమల్ పాల్గొన్నారు.

గ్రామ, వార్డు వలంటీర్లు..

లక్ష్మీపురం: పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలలో కృష్ణా, గుంటూరు నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ఏపీ గ్రామ వార్డు వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు హుమాయూన్ బాషా తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం వలంటీర్ సంఘం సమావేశం నిర్వహించారు. వలంటీర్లకు తప్పుడు వాగ్దానాలు ఇచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

లక్ష్మీపురం: మిర్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో రూ.18 వేలు ఉన్న మిర్చి ధర ఈ ఏడాది కేవలం రూ. 10వేలు లోపే ఉండటం దారుణం అన్నారు. క్వింటాకు రూ.20 వేలు పైనే ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పర్యటనలో భాగంగా మిర్చి యార్డును ప్రక్షాళన చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఇమ్మడి రామారావు, రైతు నాయకులు జొన్నల కోటిరెడ్డి, కే.నాగేశ్వర రావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తులసి సీడ్స్ ఫ్యాక్టరీ సందర్శన



సీడ్ ప్రాసెసింగ్‌పై తెలుసుకుంటున్న కె.ఎల్.వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొరిటెపాడు(గుంటూరు): కె.ఎల్. విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల నుంచి అగ్రికల్చరల్ బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విజ్ఞాన సందర్శనలో భాగంగా అమీనాబాద్‌లోని తులసి సీడ్స్ ఫ్యాక్టరీని గురువారం సందర్శించారు. వర్సిటీ నుంచి జన్యుశాస్త్రం- మొక్కల పెంపకం విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సుష్మా రాజ్ చెల్లెం, జి.సాయి వంశీరెడ్డి, కావూరి కల్పన, అసోసియేట్ ప్రొఫెసర్ (పాథాలజీ) డాక్టర్ పి.సెంథిల్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు. తులసి సీడ్స్ ఫ్యాక్టరీ సందర్శన వలన తమ విద్యార్థులు హైబ్రిడ్ విత్తనోత్పత్తికి సంబంధించి ఎన్నో విశేషాలను తెలుసుకున్నారని, వారి చదువుకి ఈ విజ్ఞానం మరింత దోహదపడుతోందన్నారు. ఫ్యాక్టరీ విజ్ఞాన సందర్శనకు అనుమతించిన తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగిష్ చంద్రలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాలపై మతోన్మాదుల దాడులను ఖండించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా శివరామిరెడ్డి

లక్ష్మీపురం: తిరుపతిలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనశాల వద్ద కొంత మంది మతోన్మాదులు రెచ్చిపోయి పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలు అమ్మరాదంటూ పుస్తక ప్రదర్శనపై దాడి చేయడం హేయమైన చర్య అని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అభ్యుదయ సాహిత్యంపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ గురువారం సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ చదివే పుస్తకాలపై..తినే ఆహారంపై..ధరించే దుస్తులపై హిందూ మతోన్మాదుల నియంత్రణ తగదన్నారు. విశ్లేషకులు ఎస్.సదాశివం మాట్లాడుతూ హైదరాబాదు పుస్తక మహోత్సవంలో ఎన్.వేణుగోపాల్ పై జరిగిన దాడి, తిరుపతి విశాలాంధ్ర బుక్ స్టాల్‌లో ఒక పుస్తకాన్ని చించి తగుల పెట్టడానికి చేసిన ప్రయత్నం లాంటివి భావ ప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాదులు చేస్తున్న దాడులలో భాగమేనన్నారు. సమావేశంలో సంస్థ సభ్యులు బి.జనార్ధనరావు, పి.భావన్నారాయణ, వెంకటరత్నం, సింగరయ్య ప్రసంగించారు.

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక పట్టాభిపురం శ్రీకంచి కామకోటి పీఠహరిహర దత్తక్షేత్రంలో శ్రీరమా సత్యనారాయణ స్వామి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం స్వామికి పంచామృతాలతో స్నాపన, అలంకార పూజ సహస్రనామార్చన, చతు స్నానార్చనలు, నిత్య హోమం, శ్రీసూక్త హోమం, యాగ పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో ధ్వజావరోహణం, మౌనబలి, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం శేషురాణి, భువనేశ్వరి బృందంతో స్వరార్చన జరగ్గా, దేవస్థాన చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.